సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 6 । సెప్టెంబర్ । 2023



పల్లెకు ఆరోగ్య భద్రత

పీహెచ్‌సీలు బలోపేతమయ్యాయి. అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయి.

- 8లో



గుండె చెరువైంది

చెరువులో మునిగి తండ్రీకూతుళ్లు చనిపోయారు. సంతబొమ్మాళి మండలంలో ఘటన జరిగింది.

- 8లో

ఈనెల 10వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ పింఛన్ కానుకను ఈ నెల 10వ తేదీ వరకు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ విద్యాసాగర్ తెలిపారు. కొత్త పింఛన్లు మంజూరు చేసి పంపిణీ చేస్తున్నందున అదనపు సమయం తీసుకుని అందరికీ పింఛన్లు అందించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి కృష్ణాష్టమి వేడుకలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో బుధవారం నుంచి పది రోజుల పాటు శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరగనున్నట్లుగా ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలియజేశారు. ఈ మేరకు ఉత్సవమూర్తులను ప్రత్యేక కృష్ణ మండపంలో వేంచేసింపజేసి ఆలయ అనివేటి మండపంలో ఏర్పాట్లు చేయనున్నట్టుగా వివరించారు. గురువారం సాయంత్రం స్థానిక కృష్ణాష్టమి మండపం వద్ద చల్లకంబాల ఉత్సవం జరుగుతుందని, భక్తుల పూజలకు కూడా ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు.

మొదటి బెర్త్ నిర్మాణానికి శంకుస్థాపన



టెస్ట్‌పైల్ వేయడానికి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

సంతబొమ్మాళి: మూలపేట పోర్టు నిర్మాణంలో భాగంగా మొదటి బెర్త్ నిర్మాణానికి టెస్ట్‌పైల్ వేయడానికి సోమవారం రాత్రి 12.15 నిమిషాలకు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పూజను నిర్వహించారు. పోర్టు నిర్మాణంతో జిల్లా రూపురేఖలు మారుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వసముద్ర జీఎం శంకర్ తదితరులు ఉన్నారు.

కొత్త డీఆర్‌ఓగా గణపతిరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరిని బదిలీ చేశారు. ఆమె స్థానంలో ఎం.గణపతిరావును కొత్త డీఆర్‌ఓగా నియమించారు. రాజేశ్వరి 2022 ఏప్రిల్ 4న జిల్లాలో విధుల్లో చేరారు. గత మూడు నెలలుగా వ్యక్తిగత కారణాల రీత్యా సెలవులో ఉన్నారు. ఆమె స్థానంలో ఇన్‌చార్జిగా జూన్ నెల నుంచి కొవ్వాడ ఎస్‌డీసీ భూసేకరణ అధికారి, పి.మురళీ కృష్ణ బాధ్యతలు చూసుకుంటున్నారు. తాజాగా ప్రభుత్వం ఆమెను బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె స్థానంలో విజయనగరం జిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న ఎం.గణపతిరావును జిల్లాకు డీఆర్‌ఓగా బదిలీ చేశారు. ఈయన గతంలో జిల్లాలో కొవ్వాడ భూ సేకరణ అధికారిగా పనిచేశారు. మరో రెండు రోజుల్లో విధుల్లోకి చేరనున్నారు.

బధిరులకు న్యాయసేవలు



న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: బధిరులకు న్యాయసేవలు అందిస్తున్నామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శ్రీకాకుళం నగరంలో జిల్లా కోర్టు ఆవరణలో శ్రీకాకుళం జిల్లా అసోసియేషన్ న్యాయ అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ ఎవరికైనా న్యాయ సలహాలు కావాల్సి వస్తే న్యాయసేవాధికార సంస్థను సంప్రదించవచ్చన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డిజేబుల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ కవిత, న్యాయవాది భువనేశ్వరరావు, ఇందిరాప్రసాద్, నర్మజ, సురేష్, ఎస్.రవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని హుండీ కానుకల ఆదాయం రూ.36.13 లక్షలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి హుండీల కానుకల ద్వారా రూ.36,13,859 మేరకు ఆదాయం లభించిందని ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం అనివేటి మండపంలో నిర్వహించారు. జూలై 24 నుంచి సెప్టెంబర్ 5 వరకు హుండీల్లో లభించిన ఆదాయాన్ని లెక్కించిన క్రమంలో నగదు రూపంలో రూ.35,03,010, చిల్లర రూపంలో రూ.1,10,849 వరకు లభించగా, బంగారం 16 గ్రాములు, వెండి 1 కేజీ 600 గ్రాముల వస్తువులు కానుకల రూపంలో లభించాయి. జిల్లా దేవదాయ శాఖ సూపరింటెండెంట్ బలివాడ ప్రసాద్ పట్నాయక్ పర్యవేక్షణలో జరిగిన ఈ లెక్కింపులో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



హుండీ కానుకల లెక్కింపు జరుగుతున్న దృశ్యం

తస్మైశ్రీ గురవే నమః

- తల్లిదండ్రుల తర్వాత స్థానం ఉపాధ్యాయులదే: కలెక్టర్
- జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సత్కారం



శ్రీకాకుళంలో నిర్వహించిన గురుపూజోత్సవంలో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన



విశాఖలో మంత్రి బొత్స చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జి.దామోదరరావు (ఎస్‌జీటీ, ఎంపీయూపీఎస్, ఇజ్జాడపాలెం, లావేరు)



కోట ప్రకాశరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, టెక్కలి



జి.లక్ష్మణరావు, స్కూల్ అసిస్టెంట్, జెడ్పీహెచ్‌ఎస్, గోవిందపురం, వజ్రపు కొత్తూరు

రాష్ట్రస్థాయి ఉత్తమ గురువులు

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులను మంత్రి బొత్స ప్రదానం చేశారు.

శ్రీకాకుళం న్యూకాలనీ: పిల్లలకు తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువులదేనని, గురువుల వల్లే విద్యార్థులకు జ్ఞానం కలుగుతుందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం సమీపంలోని అంబేడ్కర్ కళావేదికలో మంగళవారం జిల్లాస్థాయి గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికైన వారిని ఘనంగా సత్కరించారు. పూలమాల వేసి, పుష్పగుచ్ఛాన్ని, పండ్లను అందజేసి దుశ్శాలువాతో సత్కరించి మెమొంటో, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. వాస్తవానికి 39 మంది జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపిక కాగా.. అనారోగ్య కారణాల రీత్యా ఇద్దరు గైర్హాజరయ్యారు. మిగిలిన 37 మందిని కలెక్టర్ చేతులమీదుగా ఘనంగా సత్కరించారు. అంతకుముందు కలెక్టర్ సర్వేపల్లి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ నీరజా సుబ్రహ్మణ్యం శిష్యబృందం చేసిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కలెక్టర్ తన ప్రసంగం ప్రారంభిస్తూ.. తన గురువులకు పాదాభివందనం చేస్తున్నట్టు చెప్పారు. మట్టిని మలిచి ఒక విగ్రహం చేసినట్టు పిల్లలకు ఉత్తమ విద్యను అందించి వారు ఉన్నత స్థాయికి చేరుకునేలా తీర్చిదిద్దే దిక్సూచి గురువులేనని అన్నారు. మనందరిలోని ఓ గురువు, ఓ విద్యార్థి దాగి ఉంటాడని అన్నారు. తెలియని విషయాన్ని నేర్చుకుంటున్నప్పుడు విద్యార్థిలా.. దానిని మరొకరికి చెప్పేటప్పుడు గురువులా మారతామన్నారు. సమాజంలో గురువుల స్థానం గౌరవమైనదని, విధి నిర్వహణలో అంకితం భావం లేకుండా పనిచేస్తున్న మరికొంత మందిలో మార్పులు రావాల్సి ఉందని అన్నారు. కొందరి వైఖరి వల్ల ఉపాధ్యాయ వృత్తికి కళంకం వస్తోందన్నారు. ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా మాట్లాడుతూ క్రమశిక్షణ, జ్ఞానం పెంపొందించి, లక్ష్యం పట్ల వారికి స్పష్టత కలిగించేది గురువులేనని చెప్పారు. జిల్లా విద్యాశాఖాధికారిగా కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి, ఇతర ఉపాధ్యాయులందరికీ గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్, ఉప విద్యాశాఖాధికారులు డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, గార పగడాలమ్మ, డీసీఈబీ సెక్రటరీ జి.రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కలెక్టర్ చేతులమీదుగా సత్కారం అందుకుంటున్న సీహెచ్ సురేష్‌బాబు, ఎస్‌జీటీ, ఎంపీయూపీ స్కూల్, గులివిందలపేట



పి.రేవతివల్లభరావు, హెచ్‌ఎం, జెడ్పీహెచ్ స్కూల్, గంగువాడ | ఎం.లక్ష్మణరావు, హెచ్‌ఎం, జెడ్పీ హెచ్‌స్కూల్, కొత్తపేట | బి.కుమారస్వామి, హెచ్‌ఎం, మున్సిపల్ హైస్కూల్, చింతాడ | పి.శిరీష, ప్రిన్సిపాల్, కేజీబీవీ స్కూల్, తాళ్లవలస | డాక్టర్ అన్నా శామ్యూల్, ప్రిన్సిపాల్, ఏపీ మోడల్ స్కూల్, జి.సిగడాం | పి.రాజ్‌కుమార్, హిందీ స్కూల్ అసిస్టెంట్, బైరి వానిపేట | నల్ల తారకరామారావు, ఎస్‌ఏ బయలాజికల్‌సైన్స్, జీహెచ్‌స్కూల్, పాతపట్నం | శశిభూషణ గౌడ, ఎస్‌ఏ ఇంగ్లిష్, జెడ్పీహెచ్ స్కూల్ ఈదుపురం



ఎస్.భుజంగరావు, ఎస్‌ఏ ఇంగ్లిష్, జెడ్పీ హెచ్‌స్కూల్ మెట్టూరు | ఎస్.ధర్మారావు, ఎస్‌ఏ సోషల్ స్టడీస్, ఎంపీ యూపీస్కూల్, బలద | ఆర్.రామారావు, ఎస్‌ఏ హిందీ, జెడ్పీహెచ్ స్కూల్, బెజ్జిపురం | బి.చిన్నారావు, ఎస్‌ఏ ఇంగ్లిష్, జెడ్పీ హెచ్‌స్కూల్, నిమ్మాడ | డి.సుబ్రహ్మణ్యం, ఎస్‌ఏ ఇంగ్లిష్, ఏపీమోడల్ స్కూల్, జి.సిగడాం | సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్‌ఏ తెలుగు, ఎన్టీఆర్‌ఎం హెచ్‌స్కూల్, శ్రీకాకుళం | డి.గోవిందరావు, ఎస్‌ఏ సోషల్ స్టడీస్, ఎంపీయూపీ స్కూల్, గొల్లగండి | డి.పరమేశ్వరరావు, పీఎస్‌హెచ్‌ఎం, ఎంపీ యూపీ స్కూల్, ఎకువూరు



ఎస్.లలిత, పీఎస్‌హెచ్‌ఎం, ఎంపీయూపీ స్కూల్, ఇసకలపాలెం | ఐ.సంతోష్‌కుమార్, ఎస్‌ఏ హిందీ, జెడ్పీహెచ్ స్కూల్, సుందరపురం | టి.యశోదమ్మ, ఎస్‌జీటీ, ఎంపీపీస్కూల్, బారువపేట | వసంత రాజారావు, ఎస్‌జీటీ, ఎంపీయూపీ స్కూల్, కల్లేపల్లి | పైడి శ్యామలరావు, ఎస్‌జీటీ, ఎంపీయూపీ స్కూల్, తానెం | కె.సుహాస్‌చంద్, ఎస్‌జీటీ, ఎంపీయూపీ స్కూల్, తోటపూరు | చంద్రశేఖర్ బెహరా, ఎస్‌జీటీ, ఎంపీయూపీ స్కూల్, తర్లకోట | కె.భవానీ శంకర్, ఎస్‌జీటీ, ఎంపీయూపీ స్కూల్ ఆర్‌ఆర్ కాలనీ, హిరమండలం | కింతలి చందరరావు, ఎస్‌జీటీ, ఎంపీయూపీ స్కూల్, దనుపురం | జె.స్వప్న, ఎస్‌జీటీ, ఎంపీయూపీ స్కూల్, ఎంఎస్‌పల్లి



ఎస్.గిరిబాబు, ఎస్‌జీటీ, ఎంపీయూపీ స్కూల్, ఆర్ సీహెచ్‌కాలనీ, శ్రీకాకుళం | సూర స్వర్ణకుమారి, ఎస్‌జీటీ, ఎంపీయూపీ స్కూల్, పెద్దరావుపల్లి | ఎస్.మాధవరావు, ఎస్‌జీటీ, ఎంపీయూపీ స్కూల్, చొర్లంగి | డి.ఈశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్, జెడ్పీహెచ్ స్కూల్, అల్లినగరం | ఎం.జ్యోతిరాణి, ఫిజికల్ డైరెక్టర్, జెడ్పీ హెచ్‌స్కూల్, ఉర్లాం | బి.శంకరరావు, ఫిజికల్ డైరెక్టర్, జీహెచ్ స్కూల్, పలాస | బి.ఆదిశేషు, ఫిజికల్ డైరెక్టర్, జెడ్పీజీహెచ్ స్కూల్, టెక్కలి | మంత్రి వెంకటరాజు, పీఈటీ ఇంగ్లిష్, ఏపీ మోడల్ స్కూల్, పాతపట్నం | బీవీ సాయిరాం, ఎస్‌ఏ మాథ్స్, జెడ్పీహెచ్ స్కూల్, కేశవరావుపేట | బి.శ్రీకాంత్, ఎస్‌జీటీ, ఎంపీయూపీ స్కూల్ పీకేవానిపాలెం, కవిటి

రామ్మా పింఛన్ తీసుకో..



ఆశ్రయం అన్నది లేకుండా ఓ చోట తింటూ, మరో చోట ఉంటూ బతుకుతున్న ఓ యాచకురాలికి ప్రతి నెలా పింఛన్ మాత్రం ఠంచన్‌గా అందిస్తున్నారు. వలంటీర్ వ్యవస్థ చేసిన మేలు ఇది. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 28వ వార్డుకు చెందిన బొచ్చ కాంతమ్మకు మతిస్థిమితం లేక, అనారోగ్యంతో బాధపడుతుండడంతో జంట పట్టణాల్లో తిరుగుతూ ఎవరైనా భోజనం పెడితే తింటూ ఉండేది. ఇప్పుడు పింఛన్ డబ్బుతో కడుపు నింపుకుంటోంది. మంగళవారం పలాస ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా వలంటీర్ పట్ట చైతన్య, గొడగలవీధి కార్యదర్శి పాలక మినర్వా సమక్షంలో వేలిముద్రలు తీసుకుని పింఛన్ అందించారు. - కాశీబుగ్గ

జీవితాన్నిచ్చేది గురువులే..



సత్కారాలు అందుకున్న ప్రైవేటు ఉపాధ్యాయులతో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా తదితరులు

- ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా
- ప్రైవేట్ స్కూల్స్ నుంచి 35 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

శ్రీకాకుళం న్యూకాలనీ: తల్లిదండ్రులు జన్మనిస్తే.. గురువులు జీవితాన్ని ఇస్తారని జిల్లాలో శిక్షణ పొందుతున్న ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం బాపూజీ కళామందిరం వేదికగా ఉపాధ్యాయ దినోత్సవం సందడిగా జరిగింది. ఈ సందర్భంగా వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో ఉత్తమ బోధన అందిస్తున్న 35 మందిని ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ట్రైనీ కలెక్టర్ ఉపాధ్యాయులను సన్మానించారు. జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నిరంతరం శ్రమించే ప్రైవేట్ ఉపాధ్యాయులను ఏటా అపుస్మా సత్కరిస్తుండటం శుభ పరిణామమని అన్నారు. అంతకుముందు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అపుస్మా జిల్లా అధ్యక్షుడు పోలుమహంతి శ్రీకాంత్, గౌరవాధ్యక్షులు నరసింహమూర్తి, కోశాధికారి జ్యోతి భాస్కర్, ప్రతినిధులు అనంతరావు, అప్పారావు, అన్నెపు రమేష్ పాల్గొన్నారు.



ఆ కథనం అవాస్తవాలమయం

- పోర్టు నిర్మాణంపై విషం కక్కిన 'ఈనాడు'
- కథనాన్ని ఖండించిన జిల్లా కలెక్టర్
- వాస్తవాలను లిఖితపూర్వకంగా వెల్లడించిన వైనం



టెక్కలి: టీడీపీ హయాంలో జరగని పని వైఎస్సార్‌సీపీ హయాంలో జరుగుతోందనే బాధ.. శంకుస్థాపన నుంచి పనులు వేగంగా జరుగుతున్నాయనే కక్ష.. పరిహారాల నుంచి నిర్మాణాల వరకు ప్రభుత్వం చూపిస్తున్న చొరవపై ఓర్వలేని తనంతో.. మూలపేట పోర్టు నిర్మాణంపై 'ఈనాడు' ఓ కథనాన్ని మంగళవారం అచ్చేసింది. 'నమ్మించి నట్టేట ముంచారు' అన్న శీర్షికన అబద్ధాల వార్తను ప్రచురించింది. ఈ కథనాన్ని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తీవ్రంగా ఖండించారు. దీనిపై పూర్తిస్థాయిలో వాస్తవాలను వెల్లడిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. అధికారులను సంప్రదించకుండా, సరైన సమాచారం లేకుండా ఇలాంటి కథనాలను ప్రచురిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

- మూలపేట, విష్ణుచక్రం గ్రామాల్లో ఒక్కో జీడి, మామిడి చెట్టుకు, రూ.5 వేల చొప్పున పరిహారమిస్తామని చెప్పి రూ.2,500 పరిహారం ఇచ్చారని, కొందరికే ఇచ్చారని 'ఈనాడు' కథనంలో పేర్కొన్నారు. కానీ ఈ ఏడాది మూడు సార్లు నిర్వాసితులతో జరిపిన సమావేశాల్లో ప్రభుత్వ భూముల్లో చెట్లకు ఎలాంటి నష్టపరిహారం ఉండదని, జిరాయితీ భూముల్లో మాత్రమే చెల్లిస్తామని స్పష్టంగా చెప్పామని కలెక్టర్ తెలిపారు.
- కటాఫ్ తేదీ నాటికి, 18 ఏళ్లకు ఒకటి, రెండు నెలలు తక్కువ వయసున్నా, వారిని నిర్వాసిత కుటుంబంగా గుర్తించి ప్యాకేజీ ఇస్తామని చెప్పి ఇవ్వలేదని, స్థానిక యువతకు ఉద్యోగాల ఊసే లేదని ఈనాడు ప్రచురించింది. అయితే భూసేకరణ, పునరావాస చట్టం ప్రకారం 18 ఏళ్ల వయసు నిండని వారికి పరిహారం ఇవ్వబోమని ముందే చెప్పామని కలెక్టర్ స్పష్టం చేశారు. 18 ఏళ్ల వయసున్న వారందరికీ నిర్వాసిత ప్యాకేజీ అందించామని, పోర్టు నిర్మాణం చేస్తున్న విశ్వసముద్ర కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి మూలపేట,విష్ణు చక్రం గ్రామాల్లో గల యువత నైపుణ్య తర్ఫీదు కోసం ఒక నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరామని, ఈ గ్రామాలకు చెందిన 25 మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని తెలిపారు.
- తాత్కాలిక వలసదారులను నిర్వాసితులుగా గుర్తించలేదని కథనంలో ప్రచురించారు. అయితే వీరి జాబితాను సమర్పించాలని టెక్కలి ఆర్డీఓను ఇదివరకే ఆదేశించామని, నివేదిక అందిన వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు.
- నిర్వాసితులకు ప్రభుత్వమే ఇల్లు నిర్మిస్తుందని హామీ ఇచ్చి ఇప్పుడు ఇచ్చిన ప్యాకేజీ నుంచి ఇంటి నిర్మాణానికి రూ.3.50 లక్షలు భరించాలని చెబుతున్నట్లు కథనంలో వివరించారు. అయితే ఇంటి నిర్మాణ ఖర్చు రూ.3.55 లక్షలుగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, దీనిపై గ్రామస్తులు సంతకాలు కూడా చేశారని తెలిపారు. నిర్వాసితుల కోసం కస్పానౌపడ గ్రామంలో సుమారు 55 ఎకరాల విస్తీర్ణంలో నిర్వాసిత కాలనీ నిర్మిస్తున్నామని వివరించారు.
- పోర్టు నిర్మిత గ్రామాల ప్రభుత్వ ఉద్యోగులకూ, నిర్వాసితుల తరహాలో ప్యాకేజీ అమలు చేస్తామని హామీ ఇచ్చి, పోర్టు నిర్మిత గ్రామాల్లో ఉన్న ఆర్మీ జవాన్లు, ఉపాధ్యాయులు ఇతర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న దాదాపు 20 మంది ప్రభుత్వ ఉద్యోగులకు రూ.9.90 లక్షలకి బదులుగా రూ.4.41 లక్షలే చెల్లించినట్టు కథనం ప్రచురించారు. అయితే భూసేకరణ, పునరావాస చట్టం ప్రకారం ఉద్యోగుల వార్షిక భత్యం, ఉద్యోగం ఎంపిక కింద రూ.5,50,000 మినహాయించడం వల్ల మొత్తం ప్యాకేజీ సొమ్ములో నుంచి రూ.4.40లక్షలు ఉద్యోగులకి పరిహారం ఇచ్చామన్నారు. దీనిపై నిబంధనలు తెలుసుకోవాలని హితవు పలికారు.

క్లుప్తంగా

గుంటూరు వెళ్లి పింఛన్ అందజేత



గుంటూరులో ఆస్పత్రిలో శాంతమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ బానుప్రసాద్

లావేరు: మండలంలోని అప్పాపురం గ్రామానికి చెందిన అదపాక శాంతమ్మ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ గుంటూరులోని ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకుంది. ప్రస్తుతం అక్కడే ఉంటున్నారు. అయితే ఆమెకు పింఛన్ రావడంతో వలంటీర్ తమిరి బానుప్రసాద్ మంగళవారం గుంటూరు వెళ్లి ఆస్పత్రిలో లబ్ధిదారుకు పింఛన్ డబ్బులు అందజేశారు. ఈ డబ్బు ఆస్పత్రి ఖర్చులకు ఉపయోగపడుతుందని, ఇంత దూరం వచ్చి పింఛన్ ఇచ్చిన వలంటీర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

'శిక్షణలు సద్వినియోగం చేసుకోండి'



బెజ్జిపురం రూరల్ మార్టులో జ్యూట్ ఉత్పత్తులను పరిశీలిస్తున్న నాబార్డు డీజీఎం బెహరా

లావేరు: నాబార్డు ద్వారా మహిళలకు ఇస్తున్న శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని నాబార్డు డీజీఎం ఎంఎం బెహరా అన్నారు. మండలంలోని ఏపీ నాబార్డు సహకారంతో మండలంలోని బెజ్జిపురం గ్రామంలో గోగు కిరణాలు రైతు ఉత్పత్తి దారులు కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రూరల్ మార్టును మంగళవారం డీజీఎం సందర్శించారు. మార్టులో గల హస్తకళారూపాలు, సేంద్రీయ వ్యవసాయ ఆహార ఉత్పత్తులను, జ్యూట్ ఉత్పత్తులను పరిశీలించారు. మార్టు అభివృద్ధికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలను నాబార్డు ద్వారా అందించడానికి కృషి చేస్తామని, నాబార్డు ద్వారా మహిళలకు ఇస్తున్న ఎంఈడీపీ, ఎల్ఈడీపీ శిక్షణలను వినియోగించుకొని సొంతగా యూనిట్‌లు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీజీఎం సూచించారు.

సజావుగా పునశ్చరణ తరగతులు



మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ జ్యోతిశ్రీనివాస్

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్ర, దేశ ప్రగతిలో పంచాయతీల అభివృద్ధి కీలకమని రిసోర్సు పర్సన్ జ్యోతి శ్రీనివాస్ అన్నారు. పంచాయతీ కార్యదర్శుల పునశ్చరణ తరగతులు రెండో విడత ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో కొనసాగుతున్నాయి. ఆరు రోజుల శిక్షణలో భాగంగా రెండో రోజు శిక్షణ మంగళవారం నిర్వహించారు. ఏపీఎస్ఐఆర్‌డీ (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి సంస్థ), పంచాయతీ రాజ్ సంస్థలు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నాయి. గ్రామాల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, డ్రైనేజీలు, సిమ్మెంట్ రోడ్ల నిర్మాణం వంటివి కీలకమని చెప్పారు. ప్రస్తుతం గ్రామాల్లో సుపరిపాలన దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రత్యక్షంగా ప్రజలకు అన్ని రకాలు సేవలు అందుతున్నాయని అన్నారు. పంచాయతీ రాజ్ చట్టాలు సమర్థంగా అమలు చేయటంలో గ్రామ కార్యదర్శులది కీలక పాత్ర అని చెప్పారు. కార్యక్రమంలో రిసోర్సు పర్సన్లు లక్ష్మణరావు, భాస్కర్‌రాజు, జయబాబు, డీటీసీ పీఓ కిశోర్ కుమార్ పాల్గొన్నారు.

9న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో ఈనెల 9న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి ఉన్నతాధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంప్ నందు రొమ్ములో గెడ్డలు, థైరాయిడ్, మలంలో రక్తం, ముక్కు, చెవి, గొంతు, శరీరంలో ఎక్కడైనా కాయలు ఉండడం, నెలసరి సమయంలో అధిక రక్తస్రావం, బహిష్టు తర్వాత రక్త స్రావం, గర్భ సంచిలో గడ్డలు, చాలా కాలం నుంచి దగ్గు మొదలగు సమస్యలకు స్క్రీనింగ్ చేసి వైఎస్ ఆరోగ్యశ్రీతో ఉచితంగా వైద్యం అందిస్తామని అన్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

పల్లెకు ఆరోగ్య భద్రత

- జిల్లాలో బలోపేతమైన పీహెచ్‌సీలు
- డయాలసిస్ రోగులకు ప్రత్యేక సదుపాయాలు
- అందుబాటులో అన్ని రకాల మందులు



రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎనలైజర్స్ పరికరాలు

పలాస: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు బలోపేతమవుతున్నాయి. ఇదివరకు చాలా పరిమితమైన ఆరోగ్య సేవలతో కునారిల్లిపోయిన పీహెచ్‌సీలు ఇప్పుడు గ్రామీణులకు పూర్తిస్థాయి ఆరోగ్య భద్రత కల్పిస్తున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల రూపురేఖలు మారాయి. అన్ని రకాల సదుపాయాలతో పీహెచ్‌సీలను పల్లెలకు కానుకగా అందించారు. అంతేకాకుండా ఇక్కడ కిడ్నీ బాధితులకు కూడా ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నారు. దీని వల్ల కిడ్నీ వ్యాధి బాధితులు ఎక్కడో పట్టణాలకు వెళ్లి చికిత్స చేయించుకునే అవస్థ తొలగింది. వీరి కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం ఎనలైజర్స్ యంత్ర పరికరాలను అందుబాటులోకి తెచ్చింది.

ప్రస్తుతం జిల్లాలోని పీహెచ్‌సీల్లో గతం కంటే ఎక్కువగా ఓపీ పెరిగింది. జిల్లాలో ఒక మెడికల్ కళాశాలతో పాటు 17 పీహెచ్‌సీలు, 13 సీహెచ్‌సీలు, 2 డీహెచ్‌లు ఉన్నాయి. ఈ ఆస్పత్రుల్లో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది పనిచేస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి కేంద్రంలో ఇద్దరు వైద్యులు పనిచేస్తున్నారు. వీరు కేవలం ఆరోగ్య కేంద్రానికే పరిమితం కాకుండా గ్రామాల్లోకి వెళ్లి అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ఇంటి వద్దనే వైద్యం అందిస్తున్నారు. పీహెచ్‌సీ ఒక ఫార్మసిస్టు, లాబ్ టెక్నీషియన్‌తో పాటు మొత్తం 14 మంది వైద్య సిబ్బంది ఉన్నారు. ఈ ఆరోగ్య కేంద్రాలను కూడా నాడు–నేడు కింద ప్రభుత్వం అన్ని హంగులతో ఆధునికీకరించింది.

ప్రత్యేక పరికరాలు

జిల్లాలో కిడ్నీ రోగులు డయాలసిస్ చేసుకోవడానికి శ్రీకాకుళంతో పాటు టెక్కలి, పలాస, హరిపురం, సోంపేట తదితర ప్రాంతాల్లో తగిన యూనిట్లు, బెడ్స్ ఉండగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా క్రానిక్ కిడ్నీ డిసీజెస్ (సి.కె.డి) ఉన్న వారి కోసం ప్రభుత్వం కొత్తగా ఎనలైజర్స్ సదుపాయం కల్పించింది. ప్రస్తుతం ఉద్దానం ప్రాంతంలోని అక్కుపల్లి, వజ్రపుకొత్తూరు, గోవిందపురం వెంకటాపురం, రెంటికోట, బుడంబకాలనీ, సిరిపురం, మందస, కొర్లాం, కవిటి, రాజపురం, కంచిలి, మాణిక్యపురం, ఎం.ఎస్.పల్లి, కొలిగాం తదితర కేంద్రాల్లో ఈ ఎనలైజర్స్ పరికరాలతో కిడ్నీ రోగులకు 4 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. రోగులు ఆస్పత్రికి వెళ్లేందుకు వాహనాలను కూడా అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా వీరికి 104, 108 వాహనాలు ఎక్కువగా ఉపయోగపడుతున్నాయి.

పింఛన్ అందుతోంది



నాకు గత కొన్నేళ్ల నుంచి కిడ్నీ వ్యాధి ఉంది. కిడ్నీ వ్యాధికి సంబంధించిన మందులు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి లభిస్తున్నాయి. వారానికి ఒక సారి డయాలసిస్ చేయించుకుంటున్నాను. వాహనం వచ్చి తీసుకెళ్తుంది. నెలకి రూ.10వేలు పింఛను కూడా ప్రభుత్వం ఇస్తుంది. దీని వల్ల నా కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు లేవు.

– గేదెల రామారావు, కిడ్నీ రోగి, బొడ్డపాడు, పలాస మండలం

సీకేడీ పరికరాలు ఉన్నాయి



కిడ్నీ వ్యాధులకు సంబంధించిన క్రానిక్ కిడ్నీ డిసీజెస్ (సి.కె.డి) యంత్ర పరికరాలు మా ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. ఎలక్ట్రోలైటలైజర్స్, బయోకెమిస్ట్రీ ఎనలైజర్స్, యూరియా ఎనలైజర్స్, సెంట్రీఫ్యూజ్‌లు తదితర పరికరాలు ఉన్నాయి. ప్రాథమిక స్థాయిలో ఉన్న రోగులు ఎప్పటికప్పుడు తమ ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని అందుకు సంబంధించిన మందులు వాడుకోవచ్చు. బ్లడ్ ఇంప్రూవ్‌మెంటుకు సంబంధించిన ఐరన్ సూక్రోజ్ ఇంజెక్షన్లు కూడా ఉన్నాయి. అలాగే ఎర్త్రోపాయిటిన్ ఇంజెక్షన్లు కూడా ఇస్తున్నాము. అన్ని రకాల మందులు ఉన్నాయి.

– బి.గోపాల్, ఫార్మసిస్టు, రెంటికోట పీహెచ్‌సీ, పలాస మండలం

పిల్లలే ప్రతినిధులుగా..



జీ-20 నమూనా సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

పొందూరు: ఏపీ నేషనల్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో తాడివలస ఉన్నత పాఠశాలలో జీ–20 దేశాల మోడల్ సమ్మిట్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థులే 20 దేశాలకు చెందిన ప్రతినిధులుగా వ్యవహరించారు. ఇంగ్లిష్‌లో ధారాళంగా మాట్లాడుతూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పర్యావరణ పరిస్థితితులు, జీవ వైవిధ్యాన్ని కాపాడడం, సంప్రదాయ జ్ఞానం భావితరాలకు అందించడం, సేంద్రీయ ఆహారం వాడకం, గనుల అక్రమ తవ్వకాలు, సముద్ర జలాల్లో చేపలను అతిగా పట్టడం తద్వారా జరిగే నష్టాలను అంచనా వేసేందుకు చర్యలు, గ్రీన్ హౌస్ ప్రభావం, వాతావరణ మార్పులు, అడవులను సంరక్షించే బాధ్యత వహించాల్సిన అవసరం, ఎలక్ట్రానిక్ వేస్టును పునర్వినియోగపరచడం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో హెచ్ఎం బల్ల కంతయ్య, నేషనల్ గ్రీన్‌కోర్ క్లస్టర్ కో ఆర్డినేటర్ పూజారి హరిప్రసన్న, సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులు గుణశేఖర్, సైన్సు ఉపాధ్యాయుడు రావాడ పాపారావులు విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

గుండె చెరువైంది

- చెరువులో దిగి తండ్రీకూతురు మృత్యువాత
- పోతునాయుడుపేటలో విషాదం



మిత్తాన కామేశ్వరరావు



గిన్ని రాజేశ్వరి

సంతబొమ్మాళి: మండలం హనుమంతునాయుడుపేట పంచాయతీ పోతునాయుడుపేటలో మంగళవారం విషాదం చోటు చేసుకుంది. చెరువులో మునిగి తండ్రీకూతుళ్లు మృతి చెందడంతో ఊరు మూగబోయింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మిత్తాన కామేశ్వరరావు (66) కౌలుకు తీసుకున్న పొలానికి నీరు పెట్టేందుకు మంగళవారం పంపుసెట్టుతో వెళ్లారు. కామేశ్వరరావు చిన్న కుమార్తె గిన్న రాజేశ్వరి(46) కూడా తండ్రికి సాయం చేసేందుకు వెళ్లారు. గట్టుపైన పంపుసెట్టు పెట్టి పైపును నీటిలో ఉంచేందుకు కామేశ్వరరావు చెరువులో దిగారు. అయితే చెరువులోని తీగలు కాలికి చుట్టుకోవడంతో బయటకు రాలేక మునిగిపోయాడు. తండ్రిని కాపాడుదామని రాజేశ్వరి కూడా చెరువులో దిగారు. కానీ ఆమె కాలికి కూడా తీగలు చుట్టుకోవడం, అక్కడ లోతు ఎక్కువగా ఉండడంతో ఇద్దరూ బయటపడలేకపోయారు. సమయానికి సాయం చేసేందుకు కూడా ఎవరూ లేకపోవడంతో తండ్రీకూతుళ్లు ప్రాణాలు కోల్పోయారు. పొలానికి వెళ్లిన వారు ఎంతసేపటికీ రాకపోవడంతో కామేశ్వరరావు భార్య అనసూయమ్మ గ్రామస్తులతో కలిసి చుట్టుపక్కల ప్రాంతాల్లో, చెరువుల్లో సుమారు గంటసేపు గాలించారు. ఈ క్రమంలో నీటిలో మునిగి ఉన్న తండ్రీకూతుళ్ల మృతదేహాలను గ్రామస్తులు చూసి వెలికి తీశారు. సమాచారం అందుకున్న నౌపడ ఎస్ఐ కిశోర్ వర్మ సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలకు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం టెక్కలి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మత్యువాత పడడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. కామేశ్వరరావుకు భార్య అనుసూయమ్మ నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజేశ్వరి అతనికి నాలుగో కుమార్తె. రాజేశ్వరి భర్త రెండేళ్ల కిందట మృతి చెందారు. రాజేశ్వరి కుమారుడు మధు విదేశాల్లో ఉండగా మరొక కుమారుడు ఇంటర్ పూర్తి చేశాడు.

వివాహిత ఆత్మహత్య

కురుపాం: ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ప్రేమకు ప్రతిరూపంగా ఇద్దరు పిల్లలను కన్నారు. ఇలా సంతోషంగా ఉండగానే ఇటీవల వారి మధ్య కుటుంబ కలహాలు మొదలయ్యాయి. ఎప్పటిలాగానే కోపంతో ఉన్న ఇద్దరూ మాటకు మాట అనుకున్నారు. ఇంతలోనే వివాహిత క్షణికావేశంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ విషాద సంఘటనపై ఎల్విన్‌పేట్ సీఐ సత్యనారాయణ, కురుపాం ఎస్సై సీహెచ్. ప్రసాదరావు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. పూతికవలస ఎస్సీ కాలనీకి చెందిన మండంగి దుర్గాప్రసాదరావు శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలానికి చెందిన ఎం.సంధ్య (24)ను ప్రేమించి వివాహం చేసుకున్నాడు ఇద్దరి మధ్య గొడవల కారణంగా సంధ్య ఇంట్లో ఉరి వేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే కురుపాం ఎస్సై, ఎల్విన్‌పేట సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని జంతువు దాడిలో మేక పిల్లలు మృతి



జంతువు దాడిలో మరణించిన మేకపిల్లలు

మందస: మండలంలో గుర్తు తెలియని జంతువు దాడి కొనసాగుతోంది. ఉద్దానంలో అలజడి సృష్టించిన ఈ జంతువు గిరిజన ప్రాంతానికి చేరుకుంది. బుడారిసింగి పంచాయతీలో సంచరిస్తున్న గుర్తు తెలియని జంతువు ఇదే పంచాయతీలోని పద్మాపురం గ్రామంలో సుమారు 10 మేక పిల్లలను చంపేసింది. పురుషోత్తం దొళాయి అనే పెంపకందారుడు సోమవారం రాత్రి తన మేక పిల్లలను పశువుల శాలలో ఉంచాడు. మంగళవారం ఉదయం చూసేసరికి 10 మేకపిల్లలు జంతువు దాడికి గురై మరణించినట్టు గుర్తించాడు. ఇంటి వద్దే మేక పిల్లలు మరణించడంతో పురుషోత్తం కన్నీటి పర్యంతమయ్యాడు. అధికారులు స్పందించి, నష్టపరిహారం ఇప్పించాలని కోరాడు. గుర్తు తెలియని జంతువు దాడిపై పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు



రణస్థలం: మండలంలోని నెలివాడ జాతీయ రహదారి పైవంతెనపై సోమవారం రాత్రి 9గంటల సమయంలో వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి గాయపడినట్లు జేఆర్ పురం ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు. వెంటనే క్షతగాత్రుడిని 108లో శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించి వైద్యం అందజేశారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు మంగళవారం తరలించారు. ప్రస్తుతం అతను అపస్మారక స్థితిలో ఉన్నాడు. ఈ ప్రమాదంపై జేఆర్ పురం ఎస్ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర
Bank of Maharashtra
బ్రాంచ్ విజయహర్ష అపుప్త్రి ఎదురుగా, సరస్వతి థియేటర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం, సెల్: 7972654970
ప్రధాన కార్యాలయం: లోకమంగళ్, 1501, శివాజీనగర్, పుణె-5

AW-81/Sklm/Gold Notice/2023-24 05.09.2023
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర శ్రీకాకుళం (బ్రాంచ్)

బంగారం అమ్మకం కోసం అమ్మకం ప్రకటన

దిగువ తెలిపిన వ్యక్తులు తమ రుణఖాతాలలోని మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలమైనారని ఇందుమూలంగా తెలియజేయడమైనది. రిజిస్టర్ పోస్టు ద్వారా వారికి పంపబడిన నోటీసులు బట్వాడా కాకుండా బ్యాంకుకు తిరిగి వచ్చాయి. అందువలన వారి బకాయి మొత్తాలు మరియు ఇతర చార్జీలను చెల్లించి తాకట్టుపెట్టిన సెక్యూరిటీలను 14-09-2023న లేదా అలోగా విడిపించుకోవాలని వారిని కోరడమైనది. లేనిచో బ్యాంకు యొక్క ఏకైక విచక్షణ మేరకు ఎలాంటి తదుపరి నోటీసు లేకుండా సదరు సెక్యూరిటీలు 15-09-2023న లేదా ఏదైనా ఇతర అనుకూలమైన తేదీన ఉ.10.00 గం.కు బ్యాంకు ఆవరణలో రుణగ్రహీత వ్యయం వంతున బహిరంగ వేలంలో బ్యాంకు ద్వారా విక్రయించబడును. బంగారు ఆభరణాల కొనుగోలులో ఆసక్తిగల పార్టీలు వేలంలో పాల్గొనగలరు.

క్ర.సం.	లోన్ తేదీ	లోన్ ఖాతా నంబర్	రుణగ్రహీత పేరు మరియు చిరునామా	వేలం కోసం రిజర్వు ధర
1	15.02.2023	60438774866	శ్రీ బోర గోవిందరాజు, 4-05, కొత్తపేట, సాలిహుండం, గార, శ్రీకాకుళం	రూ.6,72,000/-

తేది: 05.09.2023 బ్రాంచ్ మేనేజర్

'కుమారన్న వర్ధంతి విజయవంతం చేయాలి'



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న న్యూడెమొక్రసీ నాయకులు, కార్యకర్తలు

పలాస: సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకుడు, శ్రీకాకుళం పోరాట యోధుడు కుమారన్న 25వ వర్ధంతిని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు కోరారు. పలాస సూదికొండ కాలనీలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం వర్ధంతి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 11న కుమారన్న వర్ధంతి సభ కార్యక్రమం ఉందని, ఆ రోజు ఆయన స్మారక ఉపన్యాసం ఉంటుందని చెప్పారు. పలాసలోని పార్టీ కార్యాలయంలో సదస్సు ఉంటుందన్నారు. ఈ సదస్సుకు న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు జుత్తు వీరాస్వామి, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు బైరి కూర్మారావు, అరుణోదయ నాయకుడు కె.సోమేశ్వరరావు, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు బదకల ఈశ్వరమ్మ, సరస్వతి, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

'దళితులకు న్యాయం చేయాలి'



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇచ్ఛాపురం మండలం ఈదుపురం దళితుల ఆస్తుల ధ్వంసం విషయంలో తప్పుడు నివేదికలు ఇచ్చి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నీరుగార్చిన నాటి తహసీల్దార్ ఎస్. గురుప్రసాద్, ఇతర సిబ్బందిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక, దళిత హక్కుల పోరాట సమితి ప్రతినిధులు మంగళవారం ధర్నా నిర్వహించారు. అనపాన షణ్ముఖ రావు, యడ్ల గోపి తదితరులు మాట్లాడుతూ ఒక దళిత మహిళ కుటుంబం ఆస్తులు ధ్వంసం చేసి, కులం పేరుతో దూషించి, చంపుతామని బెదిరించిన సంఘటనలో తప్పుడు నివేదికలు ఇచ్చిన వారిని, ఈ చర్యలకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని, చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాధిత దళిత కుటుంబ సభ్యులు దోప ఎస్తేరు, దోప ఎరవయ్య, డి.హెచ్.పి.ఎస్. నాయకులు చిట్టి సింహాచలం, పొన్నాడ జగ్గారావు, ముడిదన భాస్కర రావు, కారిగ్గి కృష్ణ, సతివాడ శ్రీను, ఏఐటీయూసీ నాయకులు ఉప్పాడ సూర్యనారాయణ, చుక్క రాము, నాగుల తవుడు తదితరులు పాల్గొన్నారు.

'రక్తదానం మరొకరికి ప్రాణదానం'



ఎస్పీ జీఆర్ రాధికను సన్మానిస్తున్న గురజాడ విద్యాసంస్థ ఉపాధ్యాయులు

శ్రీకాకుళం రూరల్: రక్తదానం మరొకరికి ప్రాణదానమని ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు. మండల పరిధిలోని మునసబుపేటలో గురజాడ విద్యా సంస్థల్లో చేయిచేయి కలుపుదాం అనే స్వచ్ఛంద సేవాసంఘం ఆధ్వర్యంలో మంగవారం రక్తదాన కార్యక్రమం జరిగింది. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురుపూజోత్సవం రోజున రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. రేపటి తరం గురువులేనని జన్మనిచ్చిన తల్లిదండ్రులను గురువులను జీవితాంతం మర్చిపోరాదన్నారు. కార్యక్రమంలో గురజాడ విద్యాసంస్థల అధినేత జీవీ స్వామినాయుడు, డైరెక్టర్ జీవీ సంయుక్త, ప్రిన్సిపాల్ పులఖండం శ్రీనివాసరావు, చేయిచెయి కలుపుదాం సేవాసంఘం ప్రెసిడెంట్ సీపాన సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఆర్ఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కుమార్ నాయక్



కాశీబుగ్గ: హ్యూమన్ రైట్స్ మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డాక్టర్ కుమార్ నాయక్ ఎన్నికయ్యారు. విజయవాడ హ్యూమన్ రైట్స్ మిషన్ నేషనల్ వైస్ చైర్మన్ జీఎస్ కుమార్ నియమించినట్లు ప్రకటించారు. ఈ పదవీ కాలం రెండేళ్ల పాటు ఉంటుందని అన్నారు. పలాసకు చెందిన కుమార్‌నాయక్ ప్రభుత్వ వసతిగృహ అధికారిగా ఇటీవల పనిచేసి రిటైరయ్యారు.

రైతుల మధ్య వివాదాలు సృష్టిస్తున్నారు

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



కాశీబుగ్గలో దొర విగ్రహం వద్ద మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, దొర కుటుంబ సభ్యులు, నాయకులు

కాశీబుగ్గ: వంశధార సాగునీటి విషయంలో టెక్కలి ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు రైతుల మధ్య వివాదం సృష్టించాలని చూస్తున్నారని మంత్రి సీదిరి అప్పలరాజు ధ్వజమెత్తారు. దివంగత మాజీ ఎమ్మెల్యే హనుమంతు అప్పయ్యదొర వర్ధంతి సందర్భంగా కాశీబుగ్గలో మంగళవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస నియోజకవర్గానికి వంశధార సాగునీరు వస్తుండగా, అచ్చెన్నాయుడు అనధికార ప్రాజెక్టులతో అడ్డుకున్నారని తెలిపారు. ఇప్పుడు ఎగువ, దిగువ రైతులకు గొడవలు పెడుతున్నారని ఆరోపించారు. వంశధార కాలువలు దశాబ్ద కాలంగా ఆధునికీకరించకుండా, లిఫ్టులు పెట్టి నీటిని దొంగిలిస్తున్నారని అన్నారు. దీనిపై కలెక్టర్‌కు కూడా లెటర్ రాశానని తెలిపారు. ఇదే సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్తే రైతుల మధ్య గొడవలు వద్దని హిరమండలం నుంచి నీటిని వాడుకోవాలని సూచించారని అన్నారు. పలాసకు అవసరమైన లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేస్తామని అన్నారు. మదన గోపాలపురం సాగరం పనులు పూర్తి చేసి మూడు మండలాలకు రెండు పర్యాయాలు సాగునీరు అందిస్తామని అన్నారు. పలాసలో అప్పటి ఎమ్మెల్యే ఐవన్నీ చూస్తూ ఉండిపోయారని, రైతులను పట్టించుకోకుండా మౌన దీక్ష చేశారని, జనం దాన్ని గ్రహించి ఓడించారని అన్నారు. హనుమంతు అప్పయ్యదొర స్థానిక రైతుల బాధలు చూసి వైఎస్సార్‌కు చెప్పడంతో ఆఫ్‌షోర్ రూపకల్పన జరిగిందని గుర్తు చేశారు. కాశీబుగ్గ, బెండిగేటు రైల్వే ఫ్లై ఓవర్‌లు ఆయన చలవేనని అన్నారు. కాశీబుగ్గ వంతెన కూడా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో అప్పయ్యదొర కుమారుడు హనుమంతు చిట్టి, సోదరుడు హనుమంతు వెంకటరావు దొర, హనుమంతు రామ్మోహన దొర, మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, నాయకులు పానిల శ్రీనివాస్, కోత పూర్ణచంద్రరావు, బోర కృష్ణారావు, మీసాల సురేష్‌బాబు, బెల్లాల శ్రీనివాసరావు, పైల వెంకటరావు, ఉంగ సాయికృష్ణ, మరడ బాష్కరరావు, సిర్ల రాజశేఖర్, బడగల బలయ్య, శిష్టు గోపి, శంకర్‌పండా, డబ్బీరు భవానీశంకర్, పోతనపల్లి హరిప్రసాద్, బిరాటి వల్లభ పాల్గొన్నారు.

ఎండ.. వాన



మండలంలో కొత్తరోడ్ జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై అరుదైన విధంగా వర్షం కురిసింది. ఒకవైపు భారీ వర్షం పడుతుంటే మరోవైపు చినుకు కూడా పడకుండా ఎండ కాసింది. జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు దీన్ని ఆసక్తిగా గమనించారు. – ఆమదాలవలస రూరల్

'ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన మహనీయుడు సర్వేపల్లి'



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎన్.ఈశ్వరరావు

రణస్థలం: ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చి ప్రపంచానికి గురువు గొప్పదనం చాటిచెప్పిన మహనీయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ చైర్మన్ ఎన్. ఈశ్వరరావు తెలిపారు. మండలంలోని నడుకుదిటిపాలెంలో ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ భారతదేశ రాష్ట్రపతి స్థాయికి ఎదిగి లక్షలాది మంది విద్యార్థులకు స్ఫూర్తి కలిగించారని కీర్తించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఎన్.తేజ, ఉపాధ్యాయులు ఉన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24క్యా. 10గ్రా.)	60,380–00
బంగారం(22క్యా. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో పార్ట్ / ఫుల్ టైం వర్క్ చేస్తూ ప్రతినెల 25 వేలు పైన సంపాదించవచ్చు. అర్హత : ఇంటర్ పైన, గృహిణులు, రిటైర్డ్ పర్సన్స్, స్టూడెంట్స్ వివరాలకు సంప్ర : 97015 05819 [V- 797293]

■ సి.సి. కెమెరా వర్కు చేయుటకు HELPERS కావలెను. రూమ్ + వసతి ఫ్రీ 10th, ఇంటర్, ఐటిఐ. జీతం: 10,000/– సంప్రదించండి: 9392804906 [P-779301]

■ హైదరాబాద్ స్టార్ హోటల్స్‌లో ఫుడ్ సర్వీస్‌కి క్యాటరింగ్ బాయ్స్ కావలెను. రూమ్+ఫుడ్ ఫ్రీ. జీతం: 18000-24000/- స్పా. జా॥ Ph: 9381979061 [HA-2081]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం, జీ: 18K. ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్ : 9848571888 [HA-569]

■ JOB VACANCY: TIK PVT. LTD. Age: 18 to 45 yrs, Qul: 10th to Any Degree, Salary: 18000/- to 25000/- Contact: ✆ 7207833091. [T-1225471]

■ వివిధ శాఖలలో కాంట్రాక్ట్ & ఔట్ సోర్సింగ్ జాబ్ కం॥ఆపరేటర్స్, క్లర్క్స్, అటెండర్స్, జూ॥అసిస్టెంట్స్ రికార్డ్ అసిస్టెంట్స్, ఆఫీసు అసిస్టెంట్స్ అ: 10th-PG, ఆకర్షణీయమైన జీతం కలదు. 7997699026 [G-7618]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.